క్లుప్తంగా

సొండికులం అభివృద్ధికి కృషి



సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కంచిలి: సొండికులం అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలంలోని మఠం సరియాపల్లి గ్రామంలో ఆయా కులస్తులు నిర్మించిన నూతన సంఘ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి కృష్ణారావు, సర్పంచ్ కొణపల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రత్నాల కాశీవిశ్వనాథ్ చౌదరి, కార్యదర్శి రత్నాల శ్రీనివాసరావు, సొండి కులం సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దువ్వాడ పరామర్శ



తుంబయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పొందల తుంబయ్య సోమవారం మృతి చెందడంతో, ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సోమవారం పరామర్శించారు. ఆయనతో పాటు సంతబొమ్మాళి జెడ్పీటీసీ పాల వసంత్ రెడ్డి, నాయకులు కె.సతీష్, ఎం.అప్పారావు, ఎం.నాగభూషణరావు తదితరులు ఉన్నారు.

తక్షణ సాయం అందజేత

నందిగాం: మండలంలోని కవిటి అగ్రహారం గ్రామానికి చెందిన గుమ్మడి ఎల్లమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులకు మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలును పంచాయతీ కార్యదర్శి అధ్వర్యంలో సోమవారం అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ వడ్డి మోహన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

టెక్కలి: మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు మంగళవారం అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ వీపీ రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఆదిఆంధ్రావీధిలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. అలాగే పట్టణంలో 11కేవీ టౌన్‌ఫీడర్‌లో మరమ్మతుల నిమిత్తం ఎన్టీఆర్ కాలనీ, శ్రీనివాసనగర్, ఆర్టీసీ గ్యారేజ్ , సబ్ కలెక్టర్ కార్యాలయం పరిధిలో మధ్యాహ్నం 3:30 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

విజయోత్సవ వేడుకలకు హాజరవ్వండి

మందస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాలుగు వసంతాల విజయోత్సవ వేడుకలు, విస్తృత స్థాయి సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ డొక్కరి దానయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో పలాసలోని ప్రగతి భవన్‌లో వేడుకలు జరుగుతాయన్నారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

కంచమ్మ తల్లి ముక్కుపుడక ఊరేగింపు

కంచిలి: కంచమ్మ తల్లి అమ్మవారి అలంకరణ కోసం భక్తుల విరాళాలతో నూతనంగా తయారు చేసిన బంగారం, వజ్రాలతో పొదిగిన వడ్డానం, ముక్కు పుడకలను అమ్మవారి పీఠం నుంచి సోమవారం సాయంత్రం ఊరేగింపు చేపట్టారు. అనంతరం వీటిని అమ్మవారికి అలంకరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

కరాటేలో బంగారు పతకం



శ్యామ్‌కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: హరిశ్చంద్రపురం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఆరో తరగతి విద్యార్థి కూటికుప్పల శ్యామ్‌కుమార్ ఈనెల 26, 27, 28 తేదీల్లో విశాఖపట్నంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇండో నేపాల్ కరాటే ఓపెన్ చాంపియన్ షిప్ అండర్-10 విభాగంలో సత్తాచాటి బంగారు పతకాన్ని సాధించాడు. పతకం సాధించిన శ్యామ్‌కుమార్‌ను హెచ్‌ఎం నూక లక్ష్మణరావు, సర్పంచ్ గురువెల్లి కేశవరావు, ఎంపీటీసీ సభ్యుడు బగాది దివాకర్, పూజారి సత్యం అభినందించారు.

చంద్రబాబు వైఖరి మార్చుకోవాలి



ఇచ్ఛాపురం: వైఎస్సార్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసన ర్యాలీలు

కంచిలి/ఇచ్ఛాపురం రూరల్: పేదల ఇళ్ల స్థలాలను శ్మశానవాటికలతో పోల్చి, దారుణంగా అవమానించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తన వైఖరి మార్చుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ సూచించారు. చంద్రబాబునాయుడు వైఖరిని నిరసిస్తూ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో మండలంలోని అంపురం జంక్షన్ నుంచి కంచిలి, సోంపేట మండలాల పార్టీ క్యాడర్‌తో కలిసి సోమవారం సాయంత్రం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇది పేదలకు, పెత్తందారులకు మధ్యలో జరిగే యుద్ధమని, ప్రజలంతా గమనించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం పరితపిస్తుంటే, చంద్రబాబు దుష్టచతుష్టయం పేదలకు మేలు జరగకుండా అడ్డుకుంటున్నారని దుమ్మెత్తి పోశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా(లల్లూ), రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపీపీలు పైల దేవదాస్‌రెడ్డి, నిమ్మన దాసు, ఇచ్ఛాపురం, కంచిలి పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్, గుమ్మిడి రామదాసు, ఇచ్ఛాపురం ఏఎంసీ చైర్మన్ బాబూరావు, సీడాప్ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సమాజంలో సముచిత స్థానం

ఇచ్ఛాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మహిళలకు సమాజంలో సముచిత స్థానం లభించిందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను శ్మశానవాటికలతో పోల్చి, లబ్ధిదారులను దారుణంగా అవమానించిన చంద్రబాబునాయుడు వైఖరిని ఖండిస్తూ నాలుగు మండలాల మీదుగా నిర్వహించిన ర్యాలీ స్థానిక బస్టాండ్ కూడలిలో ముగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లాబాల స్వర్ణమణి, వైఎస్సార్‌సీపీ నేతలు నర్తు నరేంద్ర, పిలక సంతోష్, ప్రత్తి అన్వేష్, ఆదిరెడ్డి, చాట్ల దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి శాశ్వతంగా సమాధి కడతారు: దువ్వాడ వాణి

టెక్కలి: పేదల సంక్షేమాన్ని అడుగడుగునా అడ్డుకుంటున్న టీడీపీకి ప్రజలు శాశ్వతంగా సమాధి కట్టే రోజులు దగ్గర పడ్డాయని వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి ధ్వజమెత్తారు. అమరావతి ప్రాంతంలో పెద్ద ఎత్తున పేదలకు ప్రభుత్వం అందజేసిన ఇళ్ల స్థలాలపై టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు భగ్గుమన్నారు. ఈ మేరకు టెక్కలిలో దువ్వాడ వాణి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. పాత జాతీయ రహదారి మీదుగా అంబేడ్కర్ జంక్షన్, మెయిన్‌రోడ్ మీదుగా బైక్ ర్యాలీను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిరుపేదలకు సొంత ఇళ్లు ఉండకూడదనే అక్కసుతో టీడీపీ నాయకులు అడుగడుగునా కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. కోర్టు కేసులతో వైఎస్సార్ జగనన్న కాలనీలను అడ్డుకునే కుట్రపూరిత చర్యలకు పాల్పడ్డారని, ఇప్పుడు అమరావతి ప్రాంతంలో నిరుపేదలకు ఇంటి స్థలాలు అందజేస్తే విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ నాయకులకు అక్రమ సంపాదనతో పెద్ద పెద్ద నగరాల్లో ఖరీదైన స్థలాలు ఉండొచ్చు గానీ, నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఉండకూడదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సరోజనమ్మ, సంతబొమ్మాళి జెడ్పీటీసీ పి.వసంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఎం.కిషోర్, నాయకులు టి.జానకిరామయ్య, ఎస్.శంకర్, ఆర్.సూర్యప్రకాష్, జె.జయరాం, టి.బలరాం, ఎస్.భీమారావు, కె.ధర్మారావు, బి.హరి, కె.సంజీవరావు, జి.మోహన్‌రెడ్డి, జె.తిరుమలరెడ్డి, కె.గోవింద్, ఎస్.రామిరెడ్డి, దువ్వాడ హైందవి, నవీన తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి: మాట్లాడుతున్న దువ్వాడ వాణి

చంద్రబాబును ప్రజలు నమ్మరు

- రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్



మాట్లాడుతున్న పేరాడ తిలక్

నందిగాం: అధికారంలో ఉన్నప్పుడు పేదలను మోసం చేసిన చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తితో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న 139 బీసీ కులాలను 56 కార్పొరేషన్లుగా ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించే అర్హత చంద్రబాబునాయుడుకు లేదన్నారు. గతంలో మహిళలకు డ్వాక్రా రుణాలు, రైతు రుణాలు మాఫీ చేస్తానని చెప్పి మోసం చేసిన చంద్రబాబు, ఇప్పుడు రాజమండ్రి మహానాడులో మహిళలకు ఆడబిడ్డ నిధి పేరులో ప్రతి నెలా డబ్బులు ఇస్తాననడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. పేదలకు ప్రభుత్వం సెంటున్నర భూమి ఇస్తుంటే దానిని చంద్రబాబు శ్మశానవాటికతో పోల్చడంపై మండిపడ్డారు. ఇప్పటికైనా చంద్రబాబు తనతీరు మార్చుకోవాలని, లేదంటే ప్రజలు టీడీపీకి సమాధి కడతారని దుమ్మెత్తిపోశారు. ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వాన్ని విమర్శించే ధైర్యం లేక, నిరంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై పచ్చ పత్రికలతో దుష్ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు అండ్ కో ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలు నమ్మరని ఇప్పటికే పలుమార్లు రుజువైందన్నారు. ఇప్పటికైనా నీతిమాలిన రాజకీయాలు మానుకోవాలని సూచించారు.

స్పందన సమస్యలకు తక్షణ పరిష్కారం



స్పందన వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

మందస: స్పందనకు వచ్చే సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నట్లు తహసీల్దార్ బడే పాపారావు, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. స్పందనలో అందిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అనంతరం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ వీడియో కాన్ఫరెన్స్‌లో స్పందన వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ గార రామ్మోహనరావు, వ్యవసాయాధికారి జి.నాగరాజు, ఏపీవో బి.వి.హరికృష్ణ పాల్గొన్నారు. కాగా పలువురు అధికారులు గైర్హాజరుపై అసహనం వ్యక్తం చేశారు.

సబ్ కలెక్టర్ స్పందనకు 30 వినతులు



దివ్యాంగురాలి సమస్యపై అధికారులతో మాట్లాడుతున్న టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 30 వినతులు అందాయి. ఈ సందర్భంగా తాను పూర్తిగా నడవలేని పరిస్థితిలో ఉన్నానని, సదరం సర్టిఫికెట్‌లో దివ్యాంగ శాతాన్ని పెంచి తనకు పింఛన్ వచ్చేలా చేయాలని సంతబొమ్మాళి మండలం లింగూడు గ్రామానికి చెందిన దారపు రాజు అనే దివ్యాంగురాలు కోరింది. రావివలస మెట్‌కోర్ ఫెర్రో ఎల్లాయ్స్ పరిశ్రమను ఇటీవల హఠాత్తుగా మూసివేసే చర్యలు చేపట్టారని, దీనివలన ఎంతో మంది కార్మికులు అవస్థలు పడుతున్నారని తక్షణమే పరిశ్రమను తెరిచి తమకు బకాయి వేతనాలు వచ్చే విధంగా చూడాలని కార్మికులు కోరారు. జయకృష్ణాపురం సమీపంలో దాలి చెరువు వద్ద పంట పొలాలకు ముంపు ప్రమాదంగా వేసిన గట్టు ఎత్తును తొలగించాలని ఆయా రైతులు విన్నవించారు.

కంచమ్మ తల్లి చల్లదనం నేడు



కంచమ్మ తల్లి అమ్మవారు

కంచిలి: మండల కేంద్రంలో కొలువై ఉన్న కంచమ్మ తల్లి అమ్మవారి చల్లదన మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. వేకువజాము నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ముందుగా ఉదయం 5.23 గంటలకు విఘ్నేశ్వర పూజ అనంతరం కంచమ్మ తల్లి మూలవిరాట్‌కు, సకల దేవదేవుళ్లకు అభిషేకాలు, హోమాలు, స్థలశుద్ధి పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఉదయం 6.15 గంటలకు అమ్మవారి నిజరూప దర్శనం, 6.36 గంటలకు జై భవానీ కలశయాత్ర, సాయంత్రం 4.49 గంటల నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మఠం కంచిలి నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా హైవే బ్రిడ్జి వరకు ఊరేగింపు చేపడతారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

బొడ్డేపల్లి శత జయంతి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: మాజీ ఎంపీ దివంగత నేత బొడ్డేపల్లి శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని పలాస కళింగ సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. సోమవారం కాశీబుగ్గలో నియోజకవర్గ కళింగ సంక్షేమ సంఘ నాయకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. శత జయంతి ముగింపు సభ జూన్ 21వ తేదీన శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు దువ్వాడ జీవితేశ్వరరావు, దువ్వాడ హేమబాబు చౌదరి, ఎండుదొర, దువ్వాడ శ్రీకాంత్, కణితి దామోదరం, బమ్మిడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ పథకాలు వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు

కంచిలి: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. మండల కేంద్రం కంచిలి-2 సచివాలయం పరిధి పెద్దపాత్రపడ గ్రామంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలు తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రాందాస్, డొక్కరి దాలయ్య, గణప సింహాచలం, బృందావన్ బిసాయి తదితరులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ కార్డులతో అధిక ప్రయోజనాలు



ఈ-శ్రమ్ కార్డులు అందజేస్తున్న దృశ్యం

సోంపేట: రాష్ట్రంలోని అసంఘటిత రంగ కార్మికులకు ఈ-శ్రమ్ కార్డులతో అధిక ప్రయోజనాలు ఉన్నాయని, ప్రతీ కార్మికుడు ఈ-శ్రమ్ కార్డు పొందాలని సహాయ కార్మికాధికారి పి.సూర్యనారాయణ సూచించారు. పట్టణంలోని సహాయ కార్మిక కార్యాలయంలో పలువురు కార్మికులకు కార్డులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోంపేట కార్యాలయం పరిధిలోని ఐదు మండలాల్లో మొత్తం 1,05,416 మంది కార్మికులు ఉండగా, ఇప్పటివరకు 77,658 మంది మాత్రమే కార్డులు పొందారన్నారు. అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

జీడి రైతుల ధర్నా

పలాస: రాజకీయాలకు అతీతంగా అధికార, ప్రతిపక్ష, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉద్దానం ప్రాంతంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద జీడి రైతులు సోమవారం ధర్నాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 80 కిలోల జీడి పిక్కల బస్తాకు రూ.16 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం



కవిటి: వలంటీర్లను సత్కరిస్తున్న సర్పంచ్ శ్రీరాంప్రసాద్ తదితరులు



నందిగాం: సైలాడలో వలంటీర్లను సత్కరిస్తున్న నాయకులు

వజ్రపుకొత్తూరు: వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని సైనూరు సర్పంచ్ అట్టాడ గోవిందరావు అన్నారు. సైనూరు సచివాలయం ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమం సోమవారం నిర్వహిచారు. సైనూరు, సుంకర జగన్నాథపురం సచివాలయాల పరధిలోని వలంటీర్లను సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌జే పురం మాజీ సర్పంచ్ గంగెట్ల గున్నమ్మ, పంచాయతీ కార్యదర్శి బి.మణికంఠ, సచివాలయ కన్వీనర్లు జి.గణపతి, మార్పు రవికుమార్, గౌడ కేశవరావు, చింత అప్పన్న, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నందిగాం: మండలంలో సైలాడ సచివాలయం పరిధిలోని వలంటీర్లను స్థానిక ఎంపీటీసీ పిన్నింటి జయరాం, నాయకుడు శంబాన దానయ్యల ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మందస: వలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం

మందస: గ్రామ వలంటీర్ల సేవలు అద్వితీయమని మూలిపాడు, సొండిపూడి సర్పంచ్‌లు గుసిరి వెంకటరావు, చిచ్చుల నళిని అన్నారు. మండలంలోని సొండిపూడి సచివాలయంలో ఆయా పంచాయతీల వలంటీర్లను సన్మానించారు. కార్యక్రమంలో చిచ్చుల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ రామచంద్ర చౌదరి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలం శ్రీను, జడ్యాడ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కవిటి: సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువగా తీసుకెళ్తున్న వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని సర్పంచ్ బెందాళం శ్రీరాంప్రసాద్ అన్నారు. మండలంలోని బొరివంక, కరాపాడు గ్రామ సచివాలయాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు బంగారు ఝాన్సీ, దుద్ది సతీష్ తదితరులు పాల్గొన్నారు.



వజ్రపుకొత్తూరు: సన్మానించిన వలంటీర్లతో సర్పంచ్ గోవిందరావు తదితరులు



కవిటి: కరపాడులో గ్రామ వలంటీర్లను సత్కరించిన దృశ్యం

పుణ్యక్షేత్రాల సందర్శనకు బస్సులు

టెక్కలి: ప్రజా రవాణా టెక్కలి డిపో నుంచి వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న పుణ్య క్షేత్రాలు, వేసవి కాలం ప్రత్యేక సందర్శన కేంద్రాలకు బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచ క్షేత్ర దర్శనాల్లో భాగంగా శ్రీముఖలింగం, ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయం, అరసవల్లి, శ్రీకూర్మం, రావివలస ప్రాంతాలకు బస్సులను నడుతున్నట్లు వెల్లడించారు. ఎక్స్‌ప్రెస్ బస్సుకు పెద్దలకు రూ.375, పిల్లలకు రూ.225, పల్లె వెలుగులో పెద్దలకు రూ.315, పిల్లలకు రూ.225లు టికెట్ ధరలు నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

అరకు ప్రాంతాల్లోని అరకు, చాపరాయి, పద్మావతి గార్డెన్స్, బొర్రా గుహలు, గిరిజన మ్యూజియం సందర్శనానికి అల్ట్రా డీలక్స్ బస్సుకు పెద్దలకు రూ.750, పిల్లలకు రూ.400 రూపాయలు టికెట్ ధరలు నిర్ణయించినట్లు వెల్లడించారు. అలాగే త్రైవైకుంఠ క్షేత్రాల దర్శనంలో భాగంగా భద్రాచలం, ద్వారకా తిరుమల, అన్నవరం సందర్శనానికి అల్ట్రా డీలక్స్ బస్సులకు పెద్దలకు రూ.2,275, పిల్లలకు రూ.1,715లు నిర్ణయించినట్లు డిపో మేనేజర్ తెలిపారు. మరిన్ని వివరాలకు 99592 25611, 73829 23311 ఫోన్ నంబర్లకు సంప్రదించాలన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి 15వ సచివాలయం పరిధిలో పాలక ముకుంద ఇటీవల ప్రమాదంలో మరణించాడు. దీంతో ఆయన కుటుంబ సభ్యులకు మంజూరైన వైఎస్సార్ బీమా రూ.5 లక్షలను మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు చేతులమీదుగా సోమవారం అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో కొలువై ఉన్న కంచమ్మ తల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధికి బలియాపుట్టుగ కాలనీకి చెందిన సుభాష్ పట్నాయక్ అనే భక్తుడు రూ.50 వేలు విరాళాన్ని సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మద్దిలి ఆనందరావు, మాజీ అధ్యక్షుడు జగదీష్ పట్నాయక్, వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి కృష్ణారావు, వ్యాపారి వూనా శ్రీకాంత్, విశ్రాంత ఉపాధ్యాయులు సాహుకారి సోమేశ్వరరావు, మునకాల కృష్ణమూర్తి, అర్చకుడు గోపాల్‌దాస్ పాల్గొన్నారు.